# వేడుక

''కాళ్ళు కడుక్కుని రండి'' నీరసంగా ఇల్లు చేరిన శివరామ్‌కి చెంబుతో నీళ్లందిస్తూ అన్నది వసంత.

''ఎందుకు'' వింతగా చూశాడామెవైపు. వసంత ఇబ్బందిగా నవ్వింది.

''కాళ్ళు కడుక్కుని లోపలికి రండి'' అన్నది చెంబు అరుగుమీద పెట్టి లోపలికెళుతూ.

శివరామ్ ''ఏవిటో గోల!'' అనుకుంటూ చెప్పులు అరుగుమీద వదిలి కాళ్ళు కడుక్కుని లోపలికెళ్ళాడు.

ముందుగదిలో కాలుపెట్టగానే, ఆ ఇంట్లో ఏవో మార్పులు స్పష్టంగా కనిపించసాగాయి. మామూలుగా ఆ గదిలో ఒక టేబుల్, రెండు కుర్చీలు మాత్రం ఉంచి, ఎవరన్నా వస్తే కూర్చోటానికి నీట్‌గా ఉంచుతుంది. అలాంటిది ఆరోజు, మంచం, పక్కబట్టలు, ఇంకా ఏవో సామాను, అన్నీ చేరి చాలా చికాకుగా ఉంది.

''ఏవిటిదంతా'' చిరాగ్గా ఆ గది కలయతిరిగి చూస్తూ అన్నాడు.

''కాఫీ ఇస్తాను రండి'' వసంత శివరామ్ మాట విననట్టుగా లోపలికెళ్ళిపోయింది.

శివరామ్‌కి ఒళ్ళు మండిపోయింది. ' ఏమైందివాళ వసంతకి? అలా నిర్లక్ష్యంగా సమాధానం దాటవేస్తోంది' అనుకుంటూ మంచంపై వాలాడు.

''వచ్చావాశివా? కాఫీ తాగావా?'' సుభద్రమ్మ లోపలికొస్తూ ఆప్యాయంగా అడిగింది.

''ఎక్కడికెళ్ళావమ్మా?'' తల్లి చేతిలో పాకెట్లు చూస్తూ అడిగాడు.

''ఏం లేదురా! అపర్ణ పెద్దమనిషైంది. దానికి తీపి ఏదన్నా చేయాలిగా! ఇంట్లో ఏమీలేదు. అలా కమలత్తయ్యనడిగి శెనగపిండి తెచ్చాను కాస్త

మైసూర్‌పాక్ చేద్దామని.''

'అపర్ణ పెద్దమనిషైందా?'' ఒక్క నిమిషం శివరామ్‌కి అర్థం కాలేదు.

అర్థమైన వెంటనే గుండెల్లో రాయిపడ్డట్టైంది.

''అపర్ణ పెద్దమనిషైంది' అంటే, అపర్ణ పెళ్ళీడుకొచ్చినట్టు లెక్క అమ్మ దృష్టిలో...

ఇంక సంబంధాలు వెతకమని అమ్మ ప్రాణం తీస్తుందా? ఇప్పటికే వంటరిగా ఈ సంసారం నడపలేక తల్లడిల్లిపోతున్నాడు. అహల్య పెళ్ళికి చేసిన అప్పే తీరలేదు. మళ్ళా ఏడాదికూడా తిరక్కుండానే పురుడు అంటూ వచ్చింది. అహల్య పురుడుకి, బారసాలకి రెండువేలుపైన అయింది. మళ్ళా అపర్ణ!... గోరుచుట్టు మీద రోకటిపోటంటే ఇదేనా?

''శివా? ఇంట్లో బొత్తిగా డబ్బుల్లేవు. నువ్వులు, కొబ్బరి చిప్పలు, ఇంకా కొన్ని సరుకులు కావాలి. పేరంటాళ్లకి అరటిపళ్ళు, తమలపాకులు, శెనగలు అవీ కొనాలి. ప్రస్తుతం కనీసం రెండొందలన్నా కావాలిరా?''

శివరామ్‌కి నవ్వొచ్చింది. తనొక ఎన్.జి.వో. తనకొచ్చే జీతంతో, తన భార్యని, తల్లిని, చెల్లెళ్లని, తమ్ముడ్ని... ఓహ్? నాన్నా నువ్వు గవర్నమెంట్ ఎంప్లాయీవన్నా కాకపోతివే! గవర్నమెంట్ ఎంప్లాయి బ్రతికున్నప్పటికన్నా చచ్చినప్పుడే విలువ ఎక్కువ. శివరామ్ ఒక్కక్షణం తన ఆలోచనకి ఉలిక్కిపడ్డాడు. ఛీ...ఛీ... ఎందుకింత నీచపు ఆలోచన?... ప్రస్తుతం తనని ఇప్పుడు ఈడ్చితన్నినా రెండు రూపాయలకన్నా ఎక్కువ రావు. రెండు వందలు కావాలిట.

''అవసరమా అమ్మా!''

''అదేమిట్రా! మళ్ళీమళ్ళీ కావాలంటే వస్తాయా ఈ వేడుకలు. అహల్యకి మాత్రం పదకొండో రోజు ఘనంగా చేయలేదూ. మీనాన్న అప్పుడేగా దానికి గొలుసు చేయించారు. కనీసం అందులో కొంతన్నా దీనికి చేయకపోతే ఎలారా?''

''అంటే ఏంచేయాలమ్మా!'' దడదడలాడుతున్న గుండె చిక్కబట్టుకొని అడిగాడు.

''పట్టు పరికిణి కొని, పదిమందినీ పిలిచి భోజనాలు, పేరంటం...''

తల్లిమాట వినగానే శివరామ్‌కి నిలువెల్లా చెప్పలేనంత నీరసం

ఆవహించింది. మళ్ళా ఎన్నెందలు కావాలో!

''కాఫీ తీసుకోండి.'' వసంత తన ఆలోచనలకి అంతరాయం కలిగించగా కాఫీ కప్పు అందుకున్నాడు. ఉదయం నుంచీ బాగా పనిచేసి అలసినట్టుగా కనురెప్పలు వాలిపోతూ, నీరసంగా ఉంది వసంత. పాపం వసంత ఈకాలం పిల్లకాదు. భార్యమీద విపరీతమైన జాలి ముంచుకొచ్చింది.

''ఇదుగో వసంతా! ఈ పిండి తీసుకుని కాస్త మైసూర్‌పాక్ చేయి'' చేతిలో పాకెట్టు అందిస్తూ పురమాయించింది సుభద్ర.

వసంత ఒక్కసారి నిస్సహాయంగా శివరావ్ వైపుచూసి లోపలికెళ్ళిపోయింది.

''శివా!''

తల్లిని మధ్యలో ఆపేస్తూ అన్నాడు ''ప్రస్తుతం నా దగ్గర డబ్బు ఏం లేదమ్మా. పచారికొట్లో పద్దురాసి కావాల్సినవి తెచ్చుకో. రేపు ఒక వందన్నా దొరికితే ఇస్తాను''

''సరే! వందమాత్రం తప్పకుండా చూడరా. పసిది బాధపడుతుంది. తనకేం వేడుకచేయట్లేదని.'' సుభద్రకూడా లేచి లోపలికెళ్ళిపోయింది.

★ ★ ★

వేడుక...

పెద్దమనిషైతే వేడుక...

పెళ్ళివేడుక...

పేరంటం వేడుక...

కడుపైతే సీమంతం వేడుక... అమ్మకి వేడుక కానిదేది?

అహల్య పెళ్ళికి శక్తికి మించి ఖర్చుచేశాడు. కారణం అమ్మ బాధపడుతుందని... అహల్యని మళ్ళా సీమంతానికి తీసుకురావటం... పురుడు... బారసాల... పలుకులకి చిలకలు,... మూడోనెల ముద్దకుడుములు- ఇంకా... ఏవో... ఏవో వేడుకలు, సరదాలు... ఇవన్నీ ఎందుకు చేసినట్టు? కేవలం అమ్మ బాధపడుతుందని, కానీ... అమ్మని బాధపెట్టకూడదనుకుంటూ, తనెంతకాలం బాధపడగలడు? మామూలుగా సంసారం చేసుకుంటే తన జీతంతో అందరికీ తిండి, బట్ట అపర్ణ, శరత్‌ల చదువు గడిచిపోతుంది. కానీ, ఇంటికి వచ్చిపోయే చుట్టాలు, వాళ్ళ భోజనాలు

ప్రతి గంటకూ కాఫీలు, టిఫిన్లు ఇలా అతిధి మర్యాదలకోసం ప్రతినెలా తను అప్పు చేయాల్సి వస్తోంది.

ప్రతినెలా అప్పు చేయటమే కాని, తీర్చేమార్గం కనపడటంలేదు. ఊళ్ళోనే ఉండి రెండు రోజులకోసారి వచ్చే చుట్టాలకి వచ్చినప్పుడల్లా భోజనాలు ఎందుకు? కానీ, ఈ మాట శివరామ్ ఎప్పుడూ తల్లితో అనలేదు. అనలేడు కూడా. ఆవిడకి బంధుప్రీతి ఎక్కువ. అంతా నా వాళ్ళే అంటుంది. కానీ, తనకి తెలుసు ఆ చుట్టాలంతా ఏదన్నా అవసరం ఉంటే తప్పరారని. వీళ్ళే తనకేదన్నా ఇబ్బంది ఎదురైతే ఆదుకోరని కూడా తెలుసు. ధరలు ఆకాశాన్నంటే ఈ రోజుల్లో అతి బంధుప్రీతి ప్రభావం మధ్యతరగతి జీవితాలపై ఎలా ఉంటుందో అనుభవపూర్వకంగా తెలుసుకున్నాడు.

ఈ కాలంలో కూడా తల్లి ఆడంబరాలు, అతిధి మర్యాదలు, వేడుకల పేరుతో జరిపే విందులు, వాటి ఖర్చులు, శివరామ్‌కి చాలా ఇబ్బందిగా చికాగ్గా ఉన్నాయి. కానీ, ఈ విషయం తల్లి అర్థం చేసుకోదు. ఆవిడకి అర్థం చేయగల శక్తి తనకి లేదు. కారణం! తనని తల్లి మరీ అసమర్థుడిగా భావిస్తుందని, ఆవిడికి చెప్పలేక తనని తానే శిక్షించుకుంటున్నాడు. పెళ్లయి రెండేళ్ళయినా పిల్లలు లేకుండా జాగ్రత్త పడ్డాడు. ఈ సాగరంలోకి మరోప్రాణిని తీసుకొచ్చి ఈదలేక అవస్థ పడేకన్నా, తీసుకురాకుండా ఉండటం మంచిది కదా! వసంత ఎంతో సహనంతో, సంస్కారంతో తనకి సహకారం ఇవ్వకపోతే ఏనాడో సన్యాసుల్లో కలిసేవాడు.

వసంత ఎంతో మంచిది. నిశ్శబ్దంగా తన పనులు తను చూసుకుంటూ, అత్తగారికి చేదోడువాదోడుగా ఉంటూ, భర్తకి అనుకూలంగా మసలుకుంటూ, నొప్పింపక తానొవ్వక అన్నట్లు ప్రవర్తిస్తూ ఉండకపోతే ఈ సంసారం ఏమయ్యేది? సమస్యలతో, చికాకులతో, తన గుండెల్లో తల దాచుకున్న శివరామ్‌కి కావాల్సినంత శాంతినివ్వగలదు ఆమె హృదయం. పిల్లలంటే ఎంత మమకారం ఉన్నా, శివరామ్ కోరిక మేరకు తల్లి కావాలన్న కోరికను మనసులోనే అణచుకుంది. శివరామ్ తండ్రి ప్రైవేటు కంపెనీలో మంచి ఉద్యోగం చేసేవాడు. ఆయన హఠాత్తుగా యాక్సిడెంట్‌లో పోవడంతో సంసారం బాధ్యత శివరామ్‌పై పడింది.

★ ★ ★

''ఏవిటి అలాగే కూర్చున్నారు. బట్టలు మార్చుకోరూ'' వసంత మాటతో ఆలోచల్నుంచి తేరుకున్నాడు.

వసంత మొహం కడుక్కుని, జడల్లుకుని వచ్చింది. ఎంత పనిచేసినా, అలసట కనిపించనివ్వని వసంత అభినందనీయురాలు. డబ్బు ఖర్చు అని తను బాధపడుతున్నాడు. కానీ, చాకిరి చేసి వసంత ఎంత అలసిపోతోందో. ఏ విధంగానూ లాభదాయకం గాని ఈ వేడుకలపైన అమ్మకి ఎందుకింత మమకారం? ఎందుకీ ఆర్భాటం? అమ్మ ధోరణి ఎలా మార్చాలి?

''బాగా అలసిపోయావా?'' వసంత చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అడిగాడు. నవ్వింది వసంత. '' అలసిపోయింది మీరు. లేవండి బట్టలు మార్చుకోండి. మైసూర్‌పాక్ తింటారా?''

''వసూ!'' ప్రేమగా పిల్చాడు.

''మైసూర్‌పాక్ కన్నా తీయటి నీమాటలు చాలు. కాస్త కబుర్లుచెప్పు. ఈ టెన్షన్ భరించలేక పోతున్నాను'' వసంతకి జాలేసింది. శివరామ్ మాటలకి. ఉబికివస్తోన్న నిట్టూర్పు అణచుకుంటూ, ఏం కబుర్లు చెప్పను? అనగనగా ఒక రాజు ఆ రాజుకి ఏడుగురు కొడుకులు...''

''చాలు, చాలు అసలు పిల్లలే లేరు ఆరాజుకి. వాడో వెధవ'' అన్నాడు శివరామ్ వసంత మాటల్ని మధ్యలో ఆపేస్తూ.

''ఎందుకు ప్రతిదీ మీకు అన్వయించుకుంటారు? పిల్లలు లేరు ఏవిటి? ఎప్పుడు కావాలంటే అప్పుడు వస్తారు'' అన్నది.

''వసూ! అయామ్ సారీ. నిన్ను అన్ని విధాలా బాధపెడుతున్నాను. అసలీ సన్నాసిని చేసుకోటానికి ఎందుకొప్పుకున్నావు?''

''ఆ రోజు మీరు సన్నాసి అని నాకు తెలియదుగా!'' పెదాల మధ్య నవ్వు బిగపడుతూ అన్నది.

''అయితే నేను నిజంగా సన్నాసినే అంటావా...''

''మీరేగా అన్నారు.'' గలగలా నవ్వింది వసంత.

''చాలుగానీ, లేవండి. పేరంటాళ్ళు వస్తారు. మీరు బట్టలు మార్చుకొని బుద్ధిగా పేపర్ చదువుకుంటూ వాకిట్లో కూర్చోండి!''

''అబ్బా! అదో తలనొప్పి!''

''వసంతా'' లోపల్నుంచి సుభద్ర కేకేసింది.

''వస్తున్నానత్తయ్యా.'' వసంత శివరామ్‌కి లుంగి అందిచ్చి లోపలికి పరుగెత్తింది. రాత్రి పూట, అదీ పదకొండు దాటాలి. అప్పుడు తప్ప భార్యతో అరగంట కూర్చుని, సరదాగా మాట్లాడుకున్న రోజులు లేవు. పొరపాటున అలా కూర్చుంటే ఎవరన్నా రావటమో, లేదా, ఏదో ఒక వంకతో సుభద్ర పిలవటమో జరుగుతూ ఉంటుంది. అమ్మకెందుకో తామిద్దరూ కులాసాగా మాట్లాడుకోటం ఇష్టం ఉండదు. శివరామ్ నిట్టూరుస్తూ లేచాడు.

వాకిట్లో ఈజీ ఛైర్‌లో వాలిన శివరామ్‌కి ఎప్పుడు నిద్రపట్టిందో తెలీలేదు. వసంత భోజనానికి లెమ్మని పిలుస్తుంటే మెలకువ వచ్చేసింది.

''ఏమిటి అంత మొద్దునిద్ర'' నవ్వింది వసంత.

''ఏవిటో అలా నిద్రపట్టేసింది. అంతా వెళ్ళిపోయారా?'' ఆవలిస్తూ అడిగాడు.

''ఆ వెళ్ళారు. రండి భోంచేద్దాం.'' ఆమెని అనుసరించి వంటగదిలోకి నడిచాడు. మధ్యగదిలో ఓ మూల ఒదిగి పడుకున్న అపర్ణని చూస్తే 'ఎంత అర్థం లేని ఆచారాలివి!' అనిపించింది. మూఢనమ్మకాలనుంచి ఈ మనుషులు బైటపడేదెప్పుడు? కళ్ళు తెరిచి ఎటో చూస్తున్న అపర్ణ అన్నయ్యని చూసి సిగ్గుగా కళ్ళు మూసుకుంది. భోజనం చేసి, మంచంపై వాలి వసంత కోసం ఎదురుచూస్తూ పడుకున్నాడు. పదకొండు గంటలకి మంచినీళ్ళ చెంబుతో వచ్చింది.

''అయిందా అమ్మాయిగారి పని'' కోపంగా చూశాడు.

నవ్వింది. '' ఇప్పటికన్నా అయింది సంతోషించండి''.

''గొప్ప చాలా కష్టపడ్డావు తలుపేసిరా...''

''వసంతా'' తలుపు వేయబోతున్న వసంత సుభద్ర కేకతో ఉసూరుమంటూ లోపలికెళ్ళింది.

''ఈ పదిరోజులు ఇవతల పడుకో. అపర్ణకి తోడుగా... బాగుండదు అక్కడ పడుకుంటే.''

తల్లి మాటలు వినిపించి శివరామ్ నిశ్చేష్టుడయాడు. ఏవిటి అమ్మ తత్వం? నా భార్య నాదగ్గర పడుకోవాలో పడుకోకూడదో ఈవిడ చెప్పాలా? ఏవిటి బాగుండనిది? వీల్లేదు... వసంత ఇక్కడ పడుకోవాల్సిందే... గట్టిగా

అరవాలనుకున్నాడు. కానీ... ఉహు... గొంతు పెగలలేదు. నిస్సహాయంగా మంచంపై వాలిపోయాడు. పదినిమిషాలకి వసంత వచ్చి దిండూ, దుప్పటి తీసుకుంటుంటే ఆమె చేయందుకుని జాలిగా పిల్చాడు ''వసూ'' వసంత ఒక్కసారి అతని మొహంలోకి చూసి కళ్ళు వాల్చుకుంది.

''ఏం పర్వాలేదు. ఇక్కడే పడుకో'' అన్నాడు.

కళ్లల్లో సుళ్ళు తిరుగుతున్న నీళ్ళని బలవంతంగా నిగ్రహించుకుంటూ నవ్వింది.

''పడుకోండి. పెందలాడే లేవాలి'' చేయి విడిపించుకొని లోపలికెళ్ళింది. ఆ గదిలో శరత్ కోసం క్రింద పరుపు వేసింది.

ఈ కాస్త ప్రైవసీ కూడా పోతే తన మనస్సులో భావాలు, బాధలూ ఎవరికి చెప్పుకోవాలి? ఆలోచనలతో, సమస్యలతో కలతబారిన హృదయానికి శాంతి ఎలా లభిస్తుంది? ఎక్కడ లభిస్తుంది? ఏవిటీ జీవితం? ఇంత అసమర్థుడేం తను? నాభార్య... నా ఇష్టం... మాకూ భవిష్యత్తు ఉంది... మాకు పిల్లలు కావాలి. ఆనందమైన జీవితం కావాలి... అని తనెందుకు ప్రతిఘటించలేకపోతున్నాడు? ఆవిడ చెప్పినట్టల్లా చేసి, ఆవిడ అర్థం లేని నమ్మకాలకి, ఆచారాలకి పరోక్షంగా తను మద్దతు ఇస్తున్నట్టేగా! అమ్మ అంటే భయమా? లేక ఆవిడమీద గౌరవమా? అమ్మ బాధపడుతుందేమోనన్న సందేహమా? లేక గొప్ప కోసమా? ఎందుకు? దేనికోసం తను ఈ ఖర్చులన్నీ భరిస్తున్నాడు? ఈ త్యాగాలు ఎవరికోసం?

ఎవరినో ఉద్ధరిస్తున్నాననుకుంటూ, తనని తానే కాక, తనతో జీవితం పంచుకున్న మరోప్రాణిని కూడా అశాంతిపాలు చేస్తున్న అసమర్థుడు... అంతే! తను అసమర్థుడు... శివరామ్ జుట్టు పీక్కున్నాడు. ఇంట్లో పసిపిల్లలు ఉంటే కాస్తలో కాస్త హాయి. కానీ...? తను కొంచెం ధైర్యం చేయాలి. వేడుకల పేరుతో తల్లి చేసే అర్థం లేని ఖర్చులు ఆపాలి. కొత్త అప్పులు చేయకుండా మెల్లిగా పాత అప్పులన్నీ తీర్చేయాలి. ఫ్యామిలీ ప్లానింగ్‌కి ఫుల్‌స్టాప్ పెట్టి, వసంత తల్లి అయ్యే అదృష్టాన్ని ఆమెకి కలిగించాలి. కానీ... ఎలా?... ఎలా?... శివరామ్‌కి నిద్ర పట్టలేదు. అశాంతిగా పొర్లసాగాడు. అవతల వసంతకూడా తలగడలో కన్నీళ్ళు దాచుకుంటోందన్న విషయం శివరామ్‌కి తెలీదు.

పదకొండోరోజు. సుభద్ర డబ్బు ఎంతకావాలో చెప్పలేదు. బట్టలనీ, సరుకులనీ, జాకెట్టు గుడ్డలనీ, ఇంకా ఏవో చెప్పింది. వాటికయ్యే ఖర్చు లెక్క చూసి వెయ్యిదాకా కావొచ్చంది వసంత.

వెయ్యి రూపాయలు... ఎక్కడ్నించి తేవాలి? ఇప్పటికే పదివేలు అప్పుంది. ఇంకా వెయ్యి. అమ్మకి అర్థంకాదు...చెప్పినా అర్థం చేసుకోదు. ఆవిడకి కొడుకు ఎలా తెస్తున్నాడో, తెలుసుకోవాలన్న ఆరాటం కానీ, ఎలా తెస్తాడో అన్న బాధ కానీ లేదు. తను అనుకున్నది చేయాలి. అందుకు శివరామ్ ఏమన్నా కాని, అడిగినంత డబ్బిస్తే చాలు. శివరామ్ కాదనలేడు. ఇదంతా-ఇలాంటి హడావుడి చేయద్దని చెప్పాలని ఉంది. కానీ, చెప్పలేడు.

''అన్ని ఖర్చులు భరించిన నీకు నా సరదా భారంగా ఉందా అన్నయ్యా'' అని అపర్ణ అడుగుతున్నట్టుగా అనిపిస్తుంది. తండ్రి లేని పిల్లకి ఈ మాత్రం చేయలేవా? అని తల్లి నిలదీస్తున్నట్లనిపిస్తుంది. ఈ విషయాలు తీరిగ్గా మాట్లాడాలంటే వసంత ఒక గంట కూడా ఒంటరిగా దొరకట్లేదు. ఇంటిపనితోటో, పసివాడి సంరక్షణతోటో గడుస్తోంది. పెళ్ళై ఏడాది కూడా కాకుండానే పిల్లాణ్ణి ఎత్తుకున్న కూతుర్ని చూసి మురుస్తోన్న అమ్మకి మూడేళ్లైనా కోడలుకి పిల్లలు కలగలేదేం అన్న ఆలోచన రావటంలేదు.

అలాంటి ఆలోచన వచ్చి, ఆవిడ అడిగితే, ఈ సంసారం కోసం వసంత చేస్తోన్న త్యాగం చెప్పాలని ఉంది శివరామ్‌కి. కానీ, ఆవిడకసలా ధ్యాసే లేదు. శివరామ్ ఆలోచనలు ఆలోచనల వరకే పరిమితం అయిపోయాయి. ఎంతో ప్రయత్నించిన మీదట ఆ రోజు ఎలాగో ఐదువందలు మాత్రం దొరికాయి. ఇంటికెళ్ళి ఎలాగైనా వసంతని తీసుకుని ఈ వంకతో బజారుకెళ్ళి కావల్సిన బట్టలు తేవాలనుకున్నాడు.

అనుకున్నట్టుగానే వసంతని బలవంతంగా బైలుదేరతీసి బజారుకెళ్ళారు. ముందే అపర్ణకి పరికిణీ కుట్టించేశారు. దాని మీదకి ఓణి కొన్నారు. అరడజను జాకెట్టు బట్టలు, పూలు, పళ్ళు వగైరా కొని ఐస్‌క్రీమ్ పార్లర్‌లోకి దారితీశాడు.

''అలా ఏ పార్కుకో పోతే సరిపోయేదిగా! దీనికో పాతిక రూపాయలు బిల్లు దండగ'' శివరామ్ మనసు గ్రహించిన వసంత అన్నది.

''పోనిద్దూ, మనకోసం ఈ మాత్రం ఖర్చు పెట్టుకోకూడదా!'' అన్నాడు. వసంత మాట్లాడలేదు.

ఆమెకి ఎన్నో అడగాలని ఉంది. డబ్బెక్కడ దొరికిందని? ఇంకెప్పుడూ ఇలా వేడుకల పేరుతో అనవసర ఖర్చులు చేయద్దని చెప్పాలని ఉంది. ఇంకా ఏవో... భాషకందని భావాలు... వ్యక్తపరచలేని బాధ... వ్యక్తం చేసి హృదయభారం తీర్చుకోవాలనే ఆరాటం... ఉపోద్ఘాతం కోసం ఎదురుచూస్తోంది.

''వసంతా! ఇదంతా అవసరమా?'' అడిగాడు శివరామ్.

''ఆ విషయం మీ తల్లీకొడుకులకే తెలియాలి'' అవకాశం కోసం చూస్తున్న వసంత కొంచెం గట్టిగానే అన్నది.

''నీకు కోపంగా ఉంది కదూ! నాపైన... నిజమే నేనొక వెధవని...''

''ఎందుకండీ పదిసార్లు అలా అనుకుని మిమ్మల్ని మీరు కించపరుచుకుంటారు?''

''నిజం వసంతా! ఎందుకో నేను అమ్మకి ఎదురు చెప్పలేకపోతున్నాను. ఆవిణ్ణి బాధపెట్టలేకపోతున్నాను.''

''ఎదురు చెప్పి ఆవిణ్ణి బాధపెట్టమని నేనూ అనను. కానీ చూడండి. ఎంతకాలం ఇలా? పెళ్ళిళ్ళు- పేరంటాలు- పురుళ్ళు- బాలసారెలు- సమర్తలూ- నోములు, వ్రతాలూ, పండగలూ, పబ్బాలూ, అల్లుళ్లని పిలవటాలూ- అంతెక్కడ ఈ వేడుకలకి? ఎందుకొచ్చిన వేడుకలు? అసలెవరు చెప్పారు ఇవి వేడుకలని? ఇవన్నీ ఆవిడకి వేడుక... కానీ మీకు... మోయలేని భారం... వేడుకలంటే ఏవిటి? విందులేగా?...

మీకు డబ్బు సమస్య ఒక్కటే కనిపిస్తోంది. కానీ, ఈ పదిరోజులూ చాకిరీతో ఎంత నలిగిపోతున్నానో తెలుసా? మీ పెద్ద చెల్లెలు కనీసం పిల్లాడ్ని కూడా ఏడుస్తుంటే దగ్గరికి తీయదు. నా పిల్లాడా? వాడి పాలు, నీళ్లు, కూడా నేనే చేయాలి... నేనూ మనిషినేగా! నాకూ కోరికలున్నాయి. కానీ మీకోసం నా కోరికలు చంపుకున్నాను. మీ బాధ చూసి, నా ఆశలు, ఆదర్శాలు, అన్నిటికీ మనసులోనే సమాధి కట్టాను. నేనూ మధ్య తరగతి కుటుంబంలో నుంచే వచ్చాను. నాకూ తెలుసు సంసారం అంటే ఏవిటి? ఎవరెవరి బాధ్యత ఎంత? దాన్ని ఎలా నిర్వర్తించాలి? వగైరా... నేను చదువుకున్నదాన్ని. నాకూ స్వతంత్ర భావాలు ఉన్నాయి. కానీ నేను మీకోసం... కేవలం మీ ప్రేమకోసం బానిస బతుకు బతుకుతున్నాను.''

''వసంతా! ఆవేశపడకు...'' వసంత వాగ్ధాటికి నిర్ఘాంతపోతూ, వారించబోయాడు.

''వద్దండి. నన్నాపద్దు. కనీసం ఇప్పటికన్నా నేను ఒక మనిషిని అని మీకు గుర్తు చేసే అవకాశం ఇచ్చారు. ఈ అవకాశం నన్ను సద్వినియోగం చేసుకోనివ్వండి. నా సహనానికి కూడా హద్దంటూ ఉంది. ఒక రోజు రెండు రోజులు కాదు. మూడు సంవత్సరాలుగా భరిస్తున్నాను. ఒక ఖర్చు కాదు. త్యాగం ఎంతకాలం చేయను? నాకు మీరు చీరలు కొనివ్వకున్నా, నగలు చేయించకున్నా ఫర్వాలేదు కానీ... పిల్లలు లేకుండా బ్రతకలేను... మనం ఇది త్యాగం అనుకుంటున్నాం. కానీ మన త్యాగాన్ని ఎవరు గుర్తిస్తారు? ఏడాది తిరక్కుండా అహల్య తల్లి అయింది. ఆ విషయం పదే పదే అంటూ ఇంటికొచ్చిన అమ్మలక్కలు, నన్నో గొడ్రాలిగా చూస్తోంటే ఆ బాధ ఎలా ఉంటుందో మీకర్థం కాదు. గుర్తింపు లేని త్యాగం ఎవరికోసం?'' వసంత కంఠం ఆగిపోయింది. దుఃఖం ఆమె కంఠంకి అడ్డుపడింది.

శివరామ్ గుండె కరిగిపోయింది. ఈమె తన భార్య వసంతేనా? సహనానికి మారుపేరు అయిన వసంతేనా? ఆమెలో ఇంత ఆవేశం, ఆవేదన దాగి ఉన్నాయా? ఏకాంతంలో బైటపడే చిలిపితనమే చూశాడు ఇన్నాళ్లు... కానీ, ఇంత వ్యధ-

''వసంతా! నువ్వేనా'' వణుకుతున్న కంఠంతో అడిగాడు.

''అవును. నేనే మీ వసంతనే. ఎన్నాళ్లనుండో నా నోటికి వేసుకున్న తాళం ఇవాళ ఊడదీశాను. ఒక్కసారి మీకెన్ని అప్పులు ఉన్నాయో ఆలోచించండి. మీ ఒక్కరి సంపాదనతో ఈ అప్పులను ఎలా తీర్చగలరు? ఒకసారి... నావల్ల కాదమ్మా, ఈ ఖర్చులు నేను భరించలేనని తెగేసి చెప్పండి. ఏం జరుగుతుంది? ప్రళయం రాదుగా! ఓ వారం లేదా నెల రోజులు బాధపడతారు. ముభావంగా ఉంటారు. ఆ తరవాత ఆవిడే అర్థం చేసుకుంటారు. మీరు అప్పు తెమ్మనగానే తెచ్చి చేయమన్న ఖర్చు చేస్తోంటే చెప్పటానికేం? ఎన్నైనా చెప్పవచ్చు. విందులు, వినోదాలకి సందర్భం అక్కర్లేదు. చేతిలో పుష్కలంగా డబ్బుండి మనసులో శాంతి ఉంటే చాలు. ప్లీజ్ నామాట వినండి'' అప్పటివరకూ ఎంతో ఆవేశంతో మాట్లాడి చివరికి అర్థింపుగా అన్నది.

''మీరు నా భర్త. భార్యగా మీ కష్టసుఖాల్లో పాలుపంచుకోటం నా

ధర్మం. కళ్లారా మీ పరిస్థితి చూస్తున్నాను. మీ స్వభావం, అలవాట్లు తెలుసు. అన్నీ అర్థం చేసుకోగల సంస్కారం నాకుంది.''

''నేను కూడా చాలా మంది అమ్మాయిల్లా మీ అమ్మా, చెల్లెళ్లని వదిలేసి వస్తే రండి లేకపోతే గుడ్‌బై అని చెప్పగలను. కాని, నేనంత మూర్ఖురాల్ని, వివేకహీనురాల్ని, స్వార్థపరురాల్ని కాదు. నాకు సంస్కారం ఉంది. మీ మీద ఎంత ప్రేమ ఉందో మీ అమ్మగారి మీద అంత గౌరవం ఉంది.

ఇవాళ మీరు మీ అమ్మగార్ని వదిలేస్తే, వాళ్లెంత బాధపడతారో, మా అమ్మానాన్నల్ని మా అన్నయ్య వదిలేసినా అలాగే బాధపడతాను. ఒక మామూలు ఆడదానిగా కాక, కొద్దిగా ఆదర్శవంతంగా ఉండాలని ప్రయత్నించాను. సంసారం ఒడిదుడుకులతో ఉంటుంది. శాంతంగా సరిదిద్దుకోవాలని ఓపిక పట్టాను. కానీ, ఇప్పుడిప్పుడే నాలో ఆ ఓపిక నశిస్తోంది. సహనం హద్దు దాటుతోంది. నా ఇల్లు, నా భర్త, నా పిల్లలు, నాది అనే జీవితం కావాలనిపిస్తోంది. మీరు నన్ను అర్థం చేసుకుని, విశాల హృదయంతో నాతో సహకరించి మన సంసారం నిలబెట్టటానికి ప్రయత్నించమని అర్థిస్తున్నాను.'' మళ్ళీ వసంత కంఠం రుద్ధమైంది.

శివరామ్ తల తిరిగిపోతోంది. ఇంత ఆవేశం ఉన్నా, అంతకు తగ్గ ఆలోచన, వివేకం ఉన్నాయి కాబట్టి వసంత ఇలా మనసు విప్పి మాట్లాడి, సమస్య పరిష్కారానికి సహకారం కోరుతోంది. అదే ఇంకెవరైనా అయితే ఈ పాటికి తన సంసారం, చేతగానితనంతో బజారుపాలయేవి. భార్య మనసు అర్థం చేసుకోలేని వెధవ తను. ''వసూ!'' అనునయంగా పిల్చాడు.

''అయామ్ సారీ! నేను నిజంగా బాధపడుతున్నాను. నీవన్నదంతా నిజం. అవును. మన జీవితం మనక్కావాలి. అందుకు మనం జాగ్రత్తగా ఉండాలి... ప్రయత్నిస్తాను. నిన్ను ఇకనుంచైనా సుఖపెట్టటానికి ప్రయత్నిస్తాను'' వసంత చేయి తన చేతిలోకి తీసుకొని అన్నాడు.

వసంత కన్నీళ్లమధ్య ''థాంక్స్'' అన్నది.

ఇద్దరూ కట్‌లెట్స్, ఐస్‌క్రీమ్ తిని బైటపడ్డారు. ఐదువందల్లో రెండు వందలు ఖర్చుకాగా, మిగిలిన డబ్బు తల్లి చేతిలో పెట్టి '' ఇంతే ఉందమ్మా! ఇంక నావల్లకాదు'' అనేసి వడివడిగా బైటికెళ్లిపోయాడు. ఆవిడ ఆ డబ్బువైపు చూసి సణుక్కుంది.

★ ★ ★

మరోనెల గడిచింది. శివరామ్ జీతం తగ్గించి ఇచ్చాడు ఆనెల. రెండు వందలు తగ్గటం చూసి అడిగింది సుభద్ర.

''ఇదేవిట్రా! ఈ నెల్లో అహల్య అత్తారింటికి వెళుతుంది. చీర సారె పెట్టాలి. ఇంకో మూడొందలు అడగాలనుకున్నాను... అసలే తగ్గించావేం?'' అన్నది. శివరామ్ గుండెల్లో రాయిపడినట్లు అయింది.

''అప్పు తీర్చాలమ్మా! బాగా పెరిగిపోయింది''. తడారిపోతున్న గొంతుతో నెమ్మదిగా అన్నాడు.

''తీర్చొచ్చులే! ఈ నెల్లోనేనా? పిల్ల వెళుతుంటే అలాగే వట్టిచేతుల్తో పంపిస్తామా ఏం?''

''ఫర్వాలేదులేవమ్మా! బాలసారెకి పెట్టాంకదా బట్టలు... మళ్ళా ఎందుకు?''

''బాగుందిరా దేనికదే. తొలిపిల్లనెత్తుకుని వెళుతుంటే చీర సారె పెట్టటం పద్ధతి''

''పద్ధతులకేంలే అత్తయ్యా! మనం ఎలా కావాలంటే అలాగే మార్చుకోవచ్చు...'' అప్పటిదాకా ఇద్దరి సంభాషణ వింటోన్న వసంత భర్త నసగడం చూసి కావాలనే కల్పించుకుంది.

''అదేవిటే నువ్వూ అలాగే అంటావు. కొత్తగా ఆలోచనలు వస్తున్నాయా?''

''లేదత్తయ్యా. పాత ఆలోచనలనే అమల్లో పెడదామని''

''ఓహో! నువ్వే వాడికి నేర్పుతున్నావన్న మాట...''

''నా మాట మీ అబ్బాయి వినేవారైతే పెళ్ళై, ఇన్నేళ్లైనా, మీ అందరి చేతా గొడ్రాలుననిపించుకునే ఖర్మ నాకు పట్టేదే కాదు...'' సుభద్ర వేసిన నిందకి దుఃఖం అడ్డుపడగా అక్కడ్నించి విసురుగా వెళ్ళిపోయింది.

ఆవిడ వసంత మాటలకి స్థాణువైపోయి నిలబడింది.

''ఏవిట్రా, ఏవిటి నీ పెళ్ళాం అనేది?''

శివరామ్‌కి దడ పుట్టింది. ఎన్నడూ లేనిది, వసంత ఇలా మాట్లాడిందేం? వసంతలో చైతన్యం మొదలైంది. ఎదురు తిరుగుతోంది. అంటే... సహనం నశిస్తోంది. వసంత అలా మారటానికి కారణం తనే! అంతే తనే!... వసంతలో వచ్చిన చైతన్యం తుపానులా మారి సంసారనావ తలక్రిందులవకముందే

శాంతపరచాలి. లేకపోతే బ్రతుకంతా తానే బాధపడాలి.

''ఏరా! మాట్లాడవేం? నేనేం దాన్ని పిల్లలను కనవద్దన్నానా?'' కోపంగా అన్నది సుభద్ర.

''అబ్బ అమ్మా! ఊరుకో. వసంత ఏదో బాధలో అన్నది.''

''అవునురా. నీ పెళ్లానికి బాధలెక్కువ, నేనే జల్సాగా ఉన్నాను. అంతేనా?''

శివరామ్‌కి చిరాకేసింది. కొంచెం విసురుగానే అన్నాడు. '' వసంత సహకారం లేకపోతే నేను ఎప్పుడో ఈ సంసారం ఈదలేక సన్యాసినైపోయే వాడిని. ఎందుకనవసరంగా తనని అంటావు?''

''నువ్వు... నువ్వేనా మాట్లాడేది ఇలా?'' ఆవిడ ఆశ్చర్యంగా చూసింది కొడుకువైపు.

శివరామ్‌కి తెగింపు వచ్చేసింది.

''అవునమ్మా! ఇన్నాళ్లూ నిన్ను బాధపెట్టకూడదని నువ్వు అడిగిందల్లా చేశాను. శక్తికి మించి అప్పులు చేశాను. ఈ అప్పులు, ఈ ఖర్చులు, ఈ బరువు, బాధ్యతలకి తోడు పిల్లలెందుకని పిల్లలు కలగకుండా జాగ్రత్తపడ్డాను. కాని ఈ సంసారానికి అంతూ, దరి లేదనిపిస్తోంది. ఈ ఖర్చులకి, ఈ వేడుకలకి ఒక హద్దంటూ లేకుండా పోతోంది. ఎంతకాలం నేనిలా ఉండగలను? ఈ ఇంటికి పెద్దకొడుకుని కాబట్టి నేనే భరిస్తాను. కాని, వసంత భరించాల్సిన అవసరం ఏవిటి? తనక్కూడా శారీరకంగా కాని, మానసికంగా కాని, ఈ ఇంట్లో విశ్రాంతి లేదు. అయినా ఎంతో సహనం ప్రదర్శించింది. ఆమె సహనాన్ని అవకాశంగా తీసుకుని ఇంకా బాధపెట్టటం ధర్మంగా ఉందా?... నాకూ పిల్లలు, సంసారం కావాలి కదమ్మా... నాది అనే జీవితం ఉంటుంది. దానికొ్కంత జాగ్రత్త కావాలిగా! ఇంకా అపర్ణ చదువుంది. దానికి పెళ్ళి చేయాలి... శరత్ డిగ్రీ చేతికందిందాకా వాడికి ఫీజులకి, పుస్తకాలకి ఇంకా ఎన్నో అవసరాలుంటాయి... వాటికి డబ్బు కావాలి. ఎక్కడ్నించి తేను? ఎలా తేను..? డబ్బులు బజార్లో దొరకవమ్మా... నాజీతం ఎంత?... నా ఖర్చులేమిటి?... అయినా! నువ్వయినా ఇంక వేడుకలనీ ఆచారాలనీ ఖర్చులు పెడితే నేను భరించలేను. నా వల్ల కాదు.

నేను బాగా అలసిపోయాను. ఈ సంసారం నేనొక్కడ్ని మోయలేను. ఇంకో విషయం... వచ్చే నెల నుంచీ వసంత కూడా ఉద్యోగం చేస్తుంది...

మీరు ఉండదల్చుకుంటే మా ఇద్దరితో కాస్త మీరూ సహకరించండి... లేదా.. నెలకింత అని నా బాధ్యతగా కొంత డబ్బిస్తాను... నేనూ వసంతా వేరే ఉంటాం...'' శివరామ్ ఈ మాటలని వడివడిగా గదిలోకి వెళ్ళిపోయాడు.

వసంత ఏడుస్తోంది. లాలనగా ఆమె తలనిమురుతూ, ''వసంతా!'' అన్నాడు. వసంత చప్పున శివరామ్ గుండెల్లో తలదాచుకుని, వెక్కి వెక్కి ఏడ్చింది.

''బాధపడకు. చెప్పేశాను..అమ్మకి నిష్కర్షగా చెప్పేశాను. ఆది నిష్ఠూరం మేలుకదా అందుకే చెప్పాను. ఇంక ఫలితం కోసం ఎదురుచూద్దాం... ఏది ఏమైనా నిన్ను ఇంక బాధపెట్టను... వసంతా... ప్లీజ్ ఇటు చూడు...''

వసంత నమ్మలేనట్టుగా చూసింది..

''అవును వసూ! అసలు అందరూ అంటారు ఆడదాని అదృష్టం పెళ్ళిమీద ఆధారపడి ఉంటుంది, అనుకూలుడైన భర్త దొరికితే అదృష్టవంతురాలు అని...కానీ...నాకనిపిస్తోంది...మగవాడి అదృష్టం కూడా భార్యతోనే ముడిపడి ఉంటుంది... భార్య అనుకూలవతి కాకపోతే, మగవాడి జీవితం నరకమే కదా! రియల్లీ అయామ్ లక్కీ...''

వసంత నిశ్శబ్దంగా శివరామ్ గుండెల్లో తలదాచుకుని మెల్లిగా అన్నది.

''నా మీద కోపం లేదా?''

''నీ మీదా? ఛ...ఛ... నా అసమర్థతనుంచి కాపాడి నాకు కాస్త ధైర్యం ఇచ్చినందుకు కృతజ్ఞతగా ఉంది... కోపం ఎందుకు?''

''అయితే మీకు ఓ వార్త చెప్పనా?''

''ఏమిటది?...''

వసంత సిగ్గుగా నవ్వి ''కళ్ళు మూసుకుని మీ చెవి నా నోటి దగ్గర పెట్టండి...'' అన్నది. శివరామ్‌కి అర్థమైంది. అయినా వసంత నోటిమీదుగా వినాలని ఆమె చెప్పినట్టే చేశాడు. చెవిలో గుసగుసగా వినిపిస్తున్న ఆమె పెదాలనుంచి వెలువడే శబ్దం బైటికి రాకుండా, శివరామ్ పెదాలు అడ్డుపడ్డాయి.

అతని స్పర్శలో మనసారా పులకించిపోతూ, ''నేను కూడా అదృష్టవంతురాలినేనన్నమాట...'' అనుకుంది వసంత.

ఈనాడు ఆదివారం అనుబంధం